రైతుల్లో అలజడి

- వాతావరణ మార్పులపై ఆందోళన
- ప్రారంభమైన వరి కోతలు
- ఆశాజనకంగా ఖరీఫ్ సీజన్



పెదపళ్లలో యంత్రాలతో కోస్తున్న వరి కోతలు

ఆలమూరు: ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో గత ఐదేళ్ల నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతాంగానికి ఈ ఏడాది వరిసాగు ఆశాజనకంగా కనిపిస్తుంది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకూ ముఖం చాటేసిన వర్షాలు మళ్లీ కోతలు సమయంలో బంగాళాఖాతలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల అక్కడక్కడా చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఈసారైనా చేతికొస్తుందా అనే మీమాంస రైతుల్లో వ్యక్తమవుతుంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో సుమారు 58 వేల ఎకరాలు ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు జరిగింతి. అధికశాతం విస్తీర్ణంలో వరి పంట తుది దశకు చేరుకోగా వివిధ మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కొంత మంది రైతులు రబీ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన బొండాలు విత్తన ధాన్యం ఇప్పటికే బల్లకట్టు ద్వారా ఒబ్బిడి చేసుకున్నారు. ఈఖరీఫ్ సీజన్‌లో సాగునీరు పుష్కలంగా అందించడం, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం, వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా పండింది. ఖరీఫ్ సీజన్‌ను ముందుగా ప్రారంభించిన ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు చురుగ్గా జరుగుతుండగా మిగిలిన చోట్ల రైతులు కోతలకు సన్నద్ధమవుతున్నారు. క్లస్టర్ పరిధిలో మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ తుది దశ పనులు జోరందుకోనున్నాయి.

కలవరపరుస్తున్న వాతావరణం

ఇప్పటి వరకూ రైతులకు అనుకూలించిన వాతావరణం కోతలు ప్రారంభమయ్యే సరికి అనుకోని మార్పులు సంభవించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజుల నుంచి మబ్బులు కమ్ముకుని వివిధ మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు, చిరు జల్లులు కురవడం రైతులను కలవరపరుస్తుంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో కోతలు కోసేందుకు సిద్ధమైన రైతులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురైంది. కోత దశలో వర్షాలు పడితే వరిపైరు నేలకొరిగి పంట దెబ్బతినడంతో పాటు పెట్టుబడులు పెరిగిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రెండు మూడు రోజుల పాటు వేచిచూసి వాతావరణం బట్టి ముందుకు సాగాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పెరిగిన పంట దిగుబడి

ఖరీఫ్‌లో వరి పంట దిగుబడి పెరిగింది. ఎకరానికి 30 నుంచి 38 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది. అలాగే రైతు భరోసా కేంద్రాలు కొన్ని నిబంధనల సడలింపు ఇచ్చి క్వింటా ధాన్యాన్ని రూ.2203 వరకూ కొనుగోలు చేస్తుంది. వారం రోజుల వ్యవధిలోనే పంట సొమ్ముతో పాటు హమాలీలు, రవాణా చార్జీలు కూడా చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే రైతులకు సరైన గిట్టుబాటు ధర వస్తుందనడంతో ఎటువంటి సందేహం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. మాసూళ్ల చేసిన పంటను సత్వరమే ఆర్బీకేల ద్వారా మాత్రమే విక్రయించుకోవాలని వ్యవసాయశాఖ సూచిస్తుంది.

రైతులు ఆందోళన చెందొద్దు



వాతావరణ పరిస్థితుల ప్రభావంపై ఆందోళన చెందొద్దు. వాతావరణ శాఖ ప్రకటించిన మూడురోజుల వర్షాల ప్రభావం మనకు అంతగా లేదు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ఆర్బీకేల ద్వారా విక్రయించి అధిక ధర పొందాలి.

– ఎస్.లక్ష్మీ లావణ్య, ఏవో, ఆలమూరు

ప్రభుత్వం సరైన ధర ప్రకటించింది



వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే రైతుకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా సరైన గిట్టుబాటు ధర లభిస్తుంది. ఇప్పటి వరకూ ఖరీఫ్ సాగులో పండించిన ధాన్యం నాణ్యత బాగానే ఉంది.

– ఇల్లూరి పట్టాభి, రైతు, పినపళ్ల

నియోజకవర్గంలో 26,904 మందికి రైతు భరోసా

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గంలో రైతు భరోసా పథకం ద్వారా 26,904 మంది రైతులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉద్యోగులతో ధాన్యం కొనుగోలుకు తీసుకుంటున్న చర్యలతో పాటు పలు అంశాలపై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పి.గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 26,904 మంది రైతులకు వారి ఖాతాల్లో రూ.5.39 కోట్లు మంగళవారం నేరుగా జమ అవుతుందన్నారు. సమావేశంలో ఏఓ బి.మృణాళిని పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు 2,257 దరఖాస్తులు

కొత్తపేట: నియోజకవర్గ పరిధిలోని ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్త ఓట్లు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించి శని, ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్‌లో 2,257 దరఖాస్తులు వచ్చినట్టు ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్ఓ) ఎం.ముక్కంటి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో 262 పోలింగ్ బూత్ ద్వారా రెండు రోజుల్లో ఫారం 6 కింద 981, ఫారం 7 కింద 828, ఫారం 8 కింద 448 దరఖాస్తులు వచ్చినట్టు ఆర్డీవో తెలిపారు. మరలా వచ్చే నెల 2, 3 తేదీల్లో ఇదే విధంగా స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. దీనిని అర్హులైన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



కత్తిమండలో ఎమ్మెల్యే రాపాకను కలసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మలికిపురం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, నాయకులు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును మర్యాద పూర్వకంగా కలిశారు. కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు కలిసి ఈ నెల 11న జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభకు సహకరించాలని కోరారు. తప్పక సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాయకుల విజ్ఞప్తి మేరకు మీటింగ్‌కు వెళ్లడానికి ఒక బస్సు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు.

పళ్లాలమ్మ హుండీ ఆదాయం రూ.3.97 లక్షలు



వానపల్లి ఆలయం హుండీ తెరిపిస్తున్న చైర్మన్ అమ్మన్న

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.3,97,192 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం పాలకమండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఈవో బొక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. 140 రోజుల అనంతరం సోమవారం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో, వేదిరేశ్వరం గ్రూపు దేవాలయాల అధికారి ఎస్.లక్ష్మి సమక్షంలో అధికారులు, సిబ్బంది హుండీని తెరిచి లెక్కించారు. పై ఆదాయం సమకూరినట్టు చైర్మన్, ఈఓలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ పర్సన్ బండారు రాజా, పాలక మండలి సభ్యులు సబ్బితి సత్యనారాయణ, ఇళ్ల రాంబాబు, కట్టా రాంబాబు, కంచుస్తంభం రాంబాబు, బండారు పేర్రాజు, తాడాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


'సంస్కృత నీతి శ్లోకాలు' పుస్తకావిష్కరణ



ఆలమూరులో ఆవిష్కరించిన సంస్కృత నీతి శ్లోకాల పుస్తకం

ఆలమూరు: స్థానిక డాక్టర్ బొబ్బా జయశ్రీ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ కవి కామవరపు మల్లికార్జునరావు(గౌరీ మల్లిక్ మాస్టర్) సంకలనం చేసిన 'సంస్కృత నీతి శ్లోకాలు' పుస్తక ఆవిష్కరణ జరిగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో నలుమూలల్లో ఉన్న ఆయన మిత్రులు పాల్గొని పుస్తక ఆవిష్కరణ చేశారు. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో సంస్కృత నీతి శ్లోకాలను తెలుగులో అందించిన కవి గౌరీ మల్లిక్‌ను సహచర మిత్రులు అభినందించారు. నేటి తరానికి ఇటువంటి పుస్తకాలు ఎంతగానో అవసరమని వ్యాఖ్యానించారు. ఏ చిన్న అంశాన్నైనా పద్యంగా మలిచి ఆశువుగా చెప్పగలిగిన నేర్పు మల్లికార్జునరావు సొంతమని, ఆయన రచించిన మునుపటి పుస్తకాల్లాగే ఈ పుస్తకం కూడా విశేష పాఠకాదరణ పొందుతుందని వారు కొనియాడారు.

చిన్నారికి ఆర్థిక సాయం



దానేశ్వరి తల్లికి సాయం అందజేస్తున్న కుమ్మర శాలివాహన సంఘ నాయకులు

అంబాజీపేట: రెండు నెలలుగా బోన్‌మారోతో బాధపడుతున్న ఐదేళ్ల చిన్నారి దానేశ్వరి వైద్య ఖర్చులకు జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు సంఘ అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి తెలిపారు. బోన్‌మారోతో బాధపడుతున్న దానేశ్వరికి రూ.8 లక్షలు వైద్యానికి ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో చిన్నారి స్వగృహం సోమేశ్వరంలో రూ.36,500ల నగదును సోమవారం పంపిణీ చేశారు. శాలివాహన హెల్పింగ్ ఆర్గనైజేషన్ యూత్, కోనసీమ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా సెక్రటరీ దాలిపర్తి భీమేశ్వరరావు, శాలివాహన యూత్ లీడర్ పాలకొల్లు వెంకటరమణ, మాగాపు శ్రీనివాస్, ఏడిద శ్రీనివాసరావు, సత్యప్రసాద్, కాజులూరి సత్తిబాబుల చేతుల మీదుగా దానేశ్వరి తల్లి కోనల దుర్గాభవానికి రూ.36,500 నగదు అందజేశామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



అంబాజీపేటలో క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం సాయిరామ్

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్, క్రికెట్ పోటీలకు అంబాజీపేట జెడ్పీ హస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో క్రీడాకారులను సోమవారం పలువురు అభినందించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు ఈ నెల 4న జి.మామిడాడ జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగాయన్నారు. బాస్కెట్‌బాల్ అండర్–14లో నిమ్మకాయల చరిష్మాసాయిరుత్వి, అండర్–17లో అడ్డాల లేహ వెంకట సత్యశ్రీలు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో అండర్–17, చిత్తూరు జిల్లా మదనపల్లిలో అండర్–14 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు జరగనున్నాయన్నారు. అలాగే అండర్–14 క్రికెట్ విభాగంలో చింతాకుల వెంకట లక్ష్మీనారాయణ జిల్లా స్థాయిలో నైపుణ్యం ప్రదర్శించి గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పీడీ ఆదిలక్ష్మిని హెచ్ఎం అభినందించారు. ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు, బీఎస్ఎస్ మూర్తి, పీఈటీ అందె సూర్యకుమారి, ఆశ్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

వైభవంగా బాలాజీ స్వామి పవిత్రోత్సవాలు



బాలబాలాజీ స్వామికి నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు

మామిడికుదురు: వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామ స్మరణ, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాల నడుమ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేనారాధనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలు జరగుతాయి. పుణ్యాహవాచనం, పరిషత్ దక్షిణ, ఋత్విక్ వరుణ, రక్షాబంధనం, అంకురార్పణ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్ర ఆదివాసం, శ్రీవారికి నవకలశ స్నపన పూజలను వైభవంగా జరిపించారు. పవిత్రోత్సవాల ద్వారా శ్రీవారిలో విశేషమైన తేజస్సు కలుగుతుందని బ్రహ్మశ్రీ చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు పేర్కొన్నారు. భక్తులు సమర్పించే పూజా ద్రవ్యాల ద్వారా పుష్పాలు, వస్త్రాలు, మనసా, వాచా, కర్మణా జరిగే దోషాలు పరిహారమవుతాయని చెప్పారు. తద్వారా శ్రీవారి కరుణా కటాక్షాలతో లోకశాంతి, విశ్వశాంతి కలుగుతుందన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.మాధవి ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, బొరుసు పార్వతీ దుర్గాభవాని, బత్తుల విజయ గంగారత్నం, ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి



నగరంలో విజయోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రజా సంకల్పయాత్రలో తెలుసుకున్న సమస్యలను పరిష్కరిస్తూ, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. జగన్ ప్రజా సంకల్పయాత్ర చేసి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక అక్విడెక్టు పార్కులో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం రాజశేఖరరెడ్డి విగ్రహానికి చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకును కట్ చేసి, కార్యకర్తలకు పంచారు. సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసుబాబు, తోరం వీవీ సత్యనారాయణ, శృంగవరపు లక్ష్మణరావు, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కుసుమ వెంకటేశ్వరరావు, చిట్టాల అర్యశ్రీను, దూనబోయిన రవిచంద్ర, దేశిరాజు సీతారామయ్య, పెచ్చెట్టి రాంబాబు, అడ్డగళ్ల శ్రీను, తాటికాయల మధు, కొల్లే సూర్యనారాయణ, పులపర్తి రాజారావు, శ్రీను, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ప్రజా సంకల్పయాత్ర నవశకానికి నాందిగా నిలిచిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర పూర్తి చేసి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలో సోమవారం విజయోత్సవం నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణుల కోలాహలం నడుమ అక్కడ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజల నుంచి వచ్చిన వినతుల ద్వారా నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలకు జగన్ శ్రీకారం చుట్టారని చెప్పారు. సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను పెంచాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, కొండేటి వికాస్‌బాబు, అన్వర్ తాహిర్ హుస్సేన్, కడలి శ్రీను, చిక్కం బుజ్జిబాబు, నూరైన్ అబ్బాస్, తోట రామకృష్ణ, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తానని చెప్పాడని.. జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే వాటిని నూరు శాతం అమలు చేశాడని ఉభయగోదావరి జిల్లా గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి నేటికి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా అంబాజీపేటలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చినబాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.శ్రీను, ఉండుర్తి నాగబాబు, కోట సత్తిబాబు, ఎం.ఆనందరావు, కె.సత్తిబాబు, సీహెచ్.శ్రీచ్ వెంకటేశ్వరరావు, డి.రాధా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీజీఎంపీ నిధులతో గ్రామీణ రోడ్ల ఆధునీకరణ



కొత్తపేట పనసలదొడ్డిలో గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: గ్రామాల్లో ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోని ఇంటర్నల్ రోడ్లు గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులతో పాటు ప్రత్యేక నిధులతో ఆధునీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక పనసలదొడ్డిలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం జగ్గిరెడ్డి ప్రారంభించారు. అదే గ్రామంలో మరో రోడ్డు సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి, గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి ప్రభుత్వ నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటానని, వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

అనుమతుల్లేని బాణసంచా అమ్మకాలపై కఠిన చర్యలు

రావులపాలెం: సర్కిల్ పరిధిలో అనుమతి లేకుండా బాణసంచా తయారీ, నిల్వ చేయడం, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ సోమవారం తెలిపారు. బాణసంచా అమ్మకం లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే విక్రయాలు చేయాలన్నారు. మిగిలిన వారు ఎవరు విక్రయించినా చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. బాణసంచా అమ్మడం, తయారీ లైసెన్స్ కల్గిన దుకాణదారులు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలతో మెరుగైన జీవనం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ..



కొత్తపేటలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక పనసలదొడ్డి, మద్దులమెరక తదితర శివారు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా వివిధ పథకాలు పొందిన లబ్ధిదారులు జగ్గిరెడ్డికి సాదరంగా స్వాగతం పలికారు. ఆయా కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తూ వాటిని వివరించారు. ఇవన్నీ అందాయా? అని ప్రశ్నించారు. దానికి ప్రతిగా వారు అన్నీ అందాయని తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఈ ఘనత ఈ దేశంలో సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక అవసరాలు తీర్చి వెలుగు తీసుకురావడమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం ఆకాంక్ష అని అన్నారు. ఈ పథకాలతో పాటు మరిన్ని పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పనసలదొడ్డి తదితర శివారు గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం డీఎస్ స్వగృహం వద్ద ఎమ్మెల్యేని డీఎస్–నాగమణి దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ డీఎస్, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, మండల మహిళా విభాగం కన్వీనర్ పోతుల చంద్రావతి, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ తదితరులు పాల్గొన్నారు.


జగనన్నను మరోసారి సీఎం చేయాలి



అంబాజీపేటలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రాష్ట్రంలో పార్టీలు, వర్గాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పిలుపునిచ్చారు. అంబాజీపేట మెట్లకాలనీలో ఉన్న షాదీఖానా భవనంలో పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండల ఎస్సీ సెల్ సమావేశం సోమవారం జరిగింది. అనరంతం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు స్వగృహం వద్ద ఎమ్మెల్యే చిట్టిబాబు విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాకారమయిందని దీనిని కొనసాగించేందుకు 2024 సాధారణ ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు గత నాలుగున్నరేళ్లలో అందిన సామాజిక న్యాయాన్ని ఈ సందర్భంగా వివరించారు. ఎస్సీ సోదరులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారన్నారు. త్వరలో జిల్లాలో నిర్వహించే సామాజిక సాధికారత బస్ యాత్రలో దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిట్టిబాబు పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కుసుమ శ్రీనివాస్, దేవరపల్లి చినబాలయోగి, మైలా ఆనందరావు, కోట విజయరాజు, వెన్నపు రాంబాబు, జనిపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


రాజారత్నం మృతి పార్టీకి తీరని లోటు



రాజారత్నం మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోలిమాటి రాజారత్నం మృతి విషయం తెలిసి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స తీసుకుంటూ సోమవారం ఉదయం ఆసుపత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హుటాహుటిన రాజారత్నం స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఏ అవసరం ఉన్నా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం రాజారత్నం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.


నేత్రదానం



కేశవరావు

ఆత్రేయపురం: మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన గారపాటి కేశవరావు (60) సోమవారం మృతి చెందారు. దీంతో ఆయన నేత్రాలను వారి కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ఐ బ్యాంకునకు సమాచారం అందించడంతో వారు వచ్చి కార్నియాలు సేకరించారు. మృతుడు కేశవరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యులను పలువురు గ్రామస్తులు అభినందించారు.

పిల్లలు భ్రమల్లో ఉంటున్నారు



రైతు నాయకులతో ముచ్చటిస్తున్న విశ్రాంత ఐపీఎస్ లక్ష్మీనారాయణ

అయినవిల్లి: వరిని పండిస్తే బియ్యం వస్తాయని తెలియనిస్థితికి ఇప్పటి పిల్లలు చేరుకుంటున్నారని కొంత కాలానికి బియ్యం హోల్‌సేల్ మాల్స్‌లో దొరుకుతాయని అనే రోజులు వస్తాయని విశ్రాంత ఐపీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం అయినవిల్లి విచ్చేసిన ఆయన రైతు నాయకులతో కొంత సేపు ముచ్చటించారు. ఆయన మాట్లా డుతూ వ్యవసాయం ఇప్పటితరం పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేకపోతే భవిష్యత్ తరాలు తిండి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై అవగాహ న కల్పించాలన్నారు. కరోనా సమయంలో అన్ని దేశాల ఆర్థిక స్థితి చిన్నాభిన్నమైతే మన దేశం మాత్రం పురోగతి పైపు పయనించిందన్నారు. వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయానికి ఆధారమైన పంట కాలువలు, డ్రైనేజీలను పునరుద్ధరించాలన్నారు. పంట ముంపుబారిన పడకుండా, పంటకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఓపీ పుస్తకాల అందజేత

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ)లో చికిత్స పొందిన రోగులకు అవుట్ పేషెంట్లకు పుస్తకాల పంపిణీ జరిగింది. ఎఫ్‌డీపీకి విచ్చేసిన రోగుల వివరాలను పూర్తిస్థాయిలో నిక్షిప్తం చేసి దానికనుగుణంగా చికిత్స అందించేందుకు ఈఓపీ పుస్తకాలు దోహదపడతాయని వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు.

కార్మిక సంఘం సభలను విజయవంతం చేయాలి

సఖినేటిపల్లి: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాజోలు నియోజకవర్గ, జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం అంతర్వేదికరలో పార్టీ నాయకుడు గెడ్డం ప్రభాకరరావు అధ్యక్షతన ఆ పార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో రావులపాలెంలో జరిగే కోనసీమ జిల్లా స్థాయి ప్రథమ మహాసభలను, ఈ నెల 9న అంతర్వేదిపాలెంలో జరిగే నియోజకవర్గ మహాసభలను విజయవంతం చేయాలని రాజేంద్రప్రసాద్ కార్యకర్తలకు సూచించారు. సభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, నల్లి బుజ్జిబాబు, దొండపాటి చిట్టిరాజు, జంపన ప్రసాదరాజు, దీపాటి గంగాజలం పాల్గొన్నారు.